ఢిల్లీకి బాలాపూర్ లడ్డూ

పీఎంకు బహూకరించనున్న బీజేపీ నేత కొలన్ శంకర్‌రెడ్డి



బాలాపూర్ లడ్డూతో ఢిల్లీకి బయలుదేరిన శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ వినాయకుడి లడ్డూ ఢిల్లీ బాటపట్టింది. ఈ ప్రసాదాన్ని వేలంలో దక్కించుకున్న బీజేపీ నేత కొలన్ శంకర్‌రెడ్డి.. దానిని ప్రధాని మోదీకి బహూకరించనున్నట్టు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శనివారం ఆయన లడ్డూతో సికింద్రాబాద్ నుంచి రాజధాని ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ఢిల్లీకి బయలుదేరారు. అక్కడ మోదీని కలిసి స్వయంగా లడ్డూ అందజేయనున్నట్టు శంకర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట బీజేపీ నేతలు డి.శ్రీనివాస్, గాజుల మధు, రవినాయక్ తదితరులు ఉన్నారు.

శ్రీవైష్ణవ సేవా సంఘం నూతన కార్యవర్గం

సరూర్‌నగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం బడంగ్‌పేట్ కార్పొరేషన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం కాశీబుగ్గ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చక్రవర్తుల జగన్మోహనాచార్యులు, అధ్యక్షుడిగా చక్రవర్తుల కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షులుగా సముద్రాల నరసింహాచార్యులు, చక్రవర్తుల భువనచంద్ర, ప్రధానకార్యదర్శిగా వేదాంతం రామ్మోహనాచార్యులు, కోశాధికారిగా కందాల నరసింహాచార్యులు, సంయుక్త కార్యదర్శిగా వోలేటి శ్రీనివాసాచార్యులు ఎన్నికయ్యారు. అనంతరం వారంతా ప్రమాణ స్వీకారం చేశారు.

సీతా మెడోస్ కాలనీ అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి



సరూర్‌నగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని సీతామెడోస్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పెద్దబావి నరేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతోపాటు ఉపాధ్యక్షులుగా సీహెచ్.రామారావు, వీఎం.మల్లేశ్, ప్రధానకార్యదర్శిగా రాథోడ్ సుభాష్, కోశాధికారిగా వైవీఎన్ రామకృష్ణారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.రాముడు, సభ్యులుగా మురళీకృష్ణ, క్రాంతికుమార్, వంశీగౌడ్, రాము, సలహాదారులుగా జగన్నాథం, వీరనారాయణ, పీతాంబరంలను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్వర్ణగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ కమిటీ ఎన్నిక

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ గౌరెల్లిలోని స్వర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా నెల్లూరి రాజు, వైస్‌చైర్మన్‌గా చెంచల శ్రీనివాస్, డైరెక్టర్లుగా గ్యార దివ్యదాస్, నీరుడి రాజు, శెట్టిగారి రాజేష్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గాగోవర్థనం నవీన్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ అధికారి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

'కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి'

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజానాట్యమండలి రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎన్ఆర్ కాలనీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె నర్సింహ, జిల్లా నిర్మాణ బాధ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి రాము, చిర్ర శేఖర్, నిరంజన్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, మానస, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణ కోసం ఇంకుడు గుంతలను నిర్మించాలి

వనస్థలిపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జలసంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి డాక్టర్ జాల సత్యనారాయణ అన్నారు. శనివారం వనస్థలిపురం రైతుబజార్ వద్ద జల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవ్ ఎర్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ టి.సురేందర్, యానాల ప్రభాకర్ రెడ్డి, గిరిధర్ పొట్లపల్లి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం రెడ్ ట్యాంక్ సమీపంలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం మంగళవాయిద్యాలు, సుప్రభాత సేవ, సువర్ణ పుష్పార్చన, గరుడ హోమం, తీర్థప్రసాద వితరణ, శ్రీవారి కల్యాణ మహోత్సవం, మహానివేదన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధానకార్యదర్శి పి.సత్యనారాయణ, కేఎల్.గణపతి, ఆర్.జగదీశ్వర్, బీవీ.పాపారావు, కె.సత్తయ్య, కె.శ్రీధర్, పి.శ్యామల, జె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనకు తెలియజేస్తే...వెంటనే పరిష్కరించడానికి కృషిచేస్తానని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని శారదానగర్‌కాలనీలో శనివారం ఆయన పర్యటించి పారిశుధ్య పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టేయడంతో రోడ్లపై ఇబ్బందికరంగా ఉన్నాయని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని తొలగించేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిషేధిత సిగరెట్ల గోదాములపై దాడులు

- రూ. కోటి విలువైన సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిషేధిత సిగరెట్లు విక్రయించడంతో పాటు.. ఎక్కువ మొత్తంలో సరుకును నిల్వచేసిన గోదాములపై సౌత్ ఈస్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. మూడు పోలీస్‌స్టేషన్‌ల పరిధుల్లో మొత్తం రూ.కోటి విలువైన నిషేధిత సిగరెట్లను పట్టుకున్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. మాదన్నపేట, మలక్‌పేట, శాలిబండ పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్ ఫైజల్, రాజుయాదవ్, మహ్మద్ అక్బర్, మహ్మద్ హసన్‌ఉద్దీన్, మహ్మద్ అఫ్జల్, మహ్మద్ షకీల్‌లు వివిధ రాష్ట్రాల నుంచి అక్రమంగా నిషేధిత గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్లు దిగుమతి చేసుకొని గోదాములలో నిల్వచేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థానిక పోలీసులతో కలిసి గోదాములపై దాడులు చేశారు. మొత్తం కోటి రూపాయల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు.

రైతులను ఆదుకుంటూ నాణ్యమైన పండ్లు ఇవ్వాలి

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎమ్మెల్యే ఎంపీ, ఎమ్మెల్సీలు, మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సీహెచ్.భాస్కరాచారి, డైరెక్టర్లు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతన్నలను ఆదుకుంటూ కొనుగోలుదారులకు నాణ్యమైన పండ్లను అందించాలని పంచాయతీరాజ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సూచించారు. బాటసింగారంలోని పండ్లమార్కెట్‌లో శనివారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సీహెచ్.భాస్కరాచారితో పాటు డైరెక్టర్లతో మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీతక్క మాట్లాడుతూ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం రైతులకు అన్యాయం జరుగకుండా, మార్కెట్ ఔన్నత్యాన్ని గౌరవాన్ని కాపాడుతూ కల్తీకి తావులేకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ప్రజాసంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. పేదలు, రైతులకు ఉపయోగపడే పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందన్నారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నూతన మార్కెట్ నిర్మాణానికి కృషిచేస్తా న్నారు. తరతరాలు గుర్తు పెట్టుకునేలా కోహెడలో మార్కెట్‌ను నిర్మించాలని పాలకవర్గానికి సూచించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నూతన మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. రైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని మార్కెట్ కమిటీ అధికారులకు సూచించారు. పాలకవర్గానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కాళ్లు పట్టుకుని అయినా కోహెడలో అధునాతన హంగులతో మార్కెట్‌ను నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, దయానంద్‌గుప్తా, కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, మార్కెట్ కమిటీ సెక్రెటరీ శ్రీనివాస్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

హయత్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులందరూ సమష్టిగా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని శ్రీరాజరాజేశ్వరి వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కాలనీలను శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాగరాజు, కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, జంగారెడ్డి, యాదిరెడ్డి, సింగిరెడ్డి మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

అమ్మవారి ఆలయాలకు పోటెత్తుతున్న భక్తులు



అల్మాస్‌గూడలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్లు, కమిటీ ప్రతినిధులు

సైదాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వనస్థలిపురం, సరూర్‌నగర్, ఎల్బీనగర్, మీర్‌పేట్, హయత్‌నగర్, మన్సూరాబాద్, సైదాబాద్, మాదన్నపేట, మలక్‌పేటలలో వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాలు, మండపాలకు భక్తులు తరలివస్తున్నారు. శనివారం సైదాబాద్ మాతమైదాన్‌లోని విజయదుర్గమాత, గాయత్రీదేవిగా, జీవనజ్యోతి సంఘంలోని శ్రీజయదుర్గాదేవి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లో...

సరూర్‌నగర్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలకు నిత్యపూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అల్మాస్‌గూడలోని అమ్మవారిని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, కార్పొరేటర్లు రామిడి మాధురీవీరకర్ణారెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

హనుమాన్ దేవాలయంలో...

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీహనుమాన్ దేవస్థానంలో సరస్వతిదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాత ఆలయంలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు, ఆలయ తాజా మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి దంపతులు, మాజీ ధర్మకర్తలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

త్రిశక్తి ఆలయంలో...

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హరిహరపురం కాలనీలోని త్రిశక్తి ఆలయంలో మహాదుర్గ అమ్మవారు స్కందమాత దేవీగా, మహాసరస్వతీదేవిగా, బాలత్రిపురసుందరీదేవిగా, మహాలక్ష్మీదేవిగా సామ్రాజ్యలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డి.విజయభాస్కర్, మేనేజింగ్ ట్రస్టీ నారాయణరెడ్డి, రవీందర్‌కుమార్, రాయుడు, ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



శివాని మహిళా కళాశాలలో బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న చైర్మన్ రామ్‌రెడ్డి, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు

ఎల్బీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబరాలు శనివారం వాడవాడల్లో, విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం నుంచి విద్యాసంస్థలకు దసరా సెలవులు ఉండటంతో శనివారమే బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేటలోని శివాని మహిళా కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డి, కళాశాల చైర్మన్ డాక్టర్ పి.రామ్‌రెడ్డి, కార్యదర్శి వెదిరె సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అనిత, డైరెక్టర్ ప్రేమ్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి వారు బతుకమ్మ ఆడారు. కొత్తపేటలోని శ్రీరామ్ కళాశాలలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో కళాశాల చైర్మన్ దాచేపల్లి రమేష్, ప్రిన్సిపల్ శ్యామల, నాగమణి, నాగలత, రామసుధ, రామశేషు, శ్రీదేవి, లలిత, శ్వేత, నవనీత, రామేశ్వర్‌రెడ్డి, రవీంద్రం, నాగేశ్వర్‌రావు, వెంకన్న పాల్గొన్నారు.

బీఎన్‌రెడ్డినగర్‌లో...

వనస్థలిపురం: విద్యార్థులు విద్యతోపాటే మన సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన, ఆసక్తిని పెంపొందించుకోవాలని సాహితీ మహిళా జూనియర్ కళాశాల డైరెక్టర్ యం.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలోని సాహితి మహిళా కళాశాలలో శనివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ విఘ్నేశ్వర్ రెడ్డి, నాగలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీసాయి డిగ్రీ, పీజీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు



సాహితీ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్ పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు

చంపాపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారిని సన్మానించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ డైరెక్టర్లు బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పూలు, పండ్ల మార్కెట్లకు ప్రత్యామ్నాయ ప్రాంతాలు చూడాలి

వనస్థలిపురం ఈస్టర్న్ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తూర్పుకాలనీల జేఏసీ ప్రతినిధులు

వనస్థలిపురం, అక్టోబరు 5(ఆంధ్ర జ్యోతి): రైతుబజార్ వద్ద పూల, పండ్ల వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలను వెతికాలే కానీ తిరిగి వారిని రైతుబజార్ సమీపంలో పూలు, పండ్ల వ్యాపార సముదాయాలను పెట్టుకునే విధంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ప్రోత్సహించే చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వనస్థలిపురం ఈస్టర్న్ (22)కాలనీల వెల్ఫేర్‌అసోసియేషన్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు హయత్‌నగర్ డివిజన్ హుడా సాయినగర్ కమ్యూనిటీహాల్‌లో శనివారం ఈస్టర్న్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు దీపావళి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ కొనేళ్లుగా వనస్థలిపురం రైతుబజార్ వద్ద పూలు, పండ్ల వ్యాపారాల మూలంగా తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయని, రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతోమంది ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిసర కాలనీల్లో కొన్ని లక్షల మంది జీవిస్తూ.. నిత్యం రాకపోకలు సాగిస్తున్నారన్నారు. వీరందరి సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకోకుండా ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, పలు రాజకీయ నాయకులు ఈ విషయాన్ని సమర్థించకూడదని అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యాపారులకు తాము వ్యతిరేకంకాదని, వారి జీవనోపాధి గురించి లక్షలాది మంది ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని కోరారు. ఒకవేళ తిరిగి ఇక్కడ వ్యాపార సముదాయాలను పునరుద్ధరిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జి.లక్ష్మారెడ్డి, కోశాధికారి బి.శ్రీనివాస్, రమణారెడ్డి, తిరుమల్ రెడ్డి, చౌదరి దివాకర్ లింగం తదితరులు పాల్గొన్నారు.